క్లుప్తంగా

సూపర్ లగ్జరీ బస్సుల ప్రారంభం



ఆర్టీసీ బస్సులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చంటి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు ఆర్టీసీ డిపోకు త్వరలో మరిన్ని కొత్త బస్సులు వచ్చే ఏర్పాటు చేశామని ఎమ్మెల్యే బడేటి చంటి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఏలూరు ఆర్టీసీ కొత్త బస్టాండులో శనివారం మూడు సూపర్ లగ్జరీ బస్సులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ బస్సులు ఏలూరు నుంచి హైదరాబాద్‌కు నడుపుతారని తెలిపారు. కోఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెద బాబు, ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు మాట్లాడారు. కార్యక్రమంలో ఏలూరు డిపో మేనేజర్ బి.వాణి, అసిస్టెంట్ మేనేజర్ జి.మురళి, అసిస్టెంట్ మెకానికల్ ఇంజినీర్ ఐ.ప్రేమ్ కుమార్, పీఆర్వో కేఎల్‌వీ నరసింహం పాల్గొన్నారు.

మద్యం ఇప్పించలేదని దాడి

ఏలూరు టౌన్: ఏలూరు టూటౌన్ ప్రాంతంలో ఒక వ్యక్తిని అడ్డగించి మద్యం ఇప్పించాలంటూ ముగ్గురు ఒత్తిడి చేశారు. అతను నిరాకరించడంతో వారు దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరు చోడిదిబ్బ ప్రాంతానికి చెందిన దాలి వెంకట దుర్గా శంకర్ ఈ నెల 2వ తేది మధ్యాహ్నం ఇంటికి వెళ్తుండగా మార్గమధ్యలో చింటు, మరో ఇద్దరు వ్యక్తులు అతన్ని అడ్డగించి మద్యానికి డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అతను నిరాకరించడంతో వారి వద్ద ఉన్న బీరు బాటిల్‌తో దాడి చేశారు. తీవ్ర గాయాలైన శంకర్‌ను ఏలూరు జీజీహెచ్‌కు తరలించారు. బాధితుడి వాంగ్మూలంపై టూటౌన్ పోలీసులు చింటు, మరో ఇద్దరిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

హైందవ శంఖారావానికి విశేష స్పందన

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆదివారం గన్నవరం సమీపంలోని కేసరపల్లి వద్ద నిర్వహించే హైందవ శంఖారావం భారీ బహిరంగ సభలో పాల్గొనేందుకు హిందువుల నుంచి విశేష స్పందన వచ్చిందని తపన ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గారపాటి సీతారామాంజనేయ చౌదరి ఒక ప్రకటనలో తెలిపారు. సభకు 500 బస్సులు, 800 కారులు, 1200 బైకులలో ఏలూరు జిల్లా నుంచి తరలి వెళ్లేందుకు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

ఆఫీస్ సబార్డినేట్లకు పదోన్నతులు

ఏలూరు(మెట్రో): జిల్లా పరిషత్ యాజమాన్యంలో పలువురు ఆఫీస్ సబార్డినేట్లకు పదోన్నతుల ఉత్తర్వులను జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ శనివారం అందజేశారు. తాను చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి నేటి వరకు 46 మందికి వివిధ కేడర్లలో పదోన్నతులు కల్పించామని చెప్పారు. మోహన్‌రావు, నటరాజు, రవి కిషోర్ పాల్గొన్నారు.

మానసిక ‘ఒత్తిడి’తో వ్యథ

- చిన్నారుల ఆత్మహత్యల డేంజర్ బెల్
- సామాజిక పరిస్థితులతో తీవ్ర ప్రభావం
- పిల్లలకు తల్లిదండ్రుల ఆదరణ అత్యవసరం

ఏలూరు టౌన్: తల్లిదండ్రులు ఉద్యోగమో, వ్యాపారమో, చిరుద్యోగమో, ఏదైనా కుటుంబ జీవనానికి బయటకెళ్లి రాత్రికి కానీ ఇళ్లకు చేరని దైన్యస్థితి నెలకొంది. ఒంటరి తనం, ఒత్తిడి, సెల్‌ఫోన్లు, సోషల్ మీడియా పిల్లలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. ఆధునిక సమాజం స్పీడ్‌గా దూసుకుపోతోంది. సామాజిక పరిస్థితులు మానవ సంబంధాలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయనేందుకు బాలల ఆత్మహత్యలే నిదర్శనం. ఏలూరు నగరంలో మూడు రోజుల వ్యవధిలోనే ఇద్దరు బాలలు ఆత్మహత్యకు పాల్పడడం డేంజర్ బెల్స్ మోగిస్తోందనే అభిప్రాయం మానసిక వైద్య నిపుణులు వ్యక్తం చేస్తున్నారు. పూర్వం ఇంట్లో తాత, అవ్వలు ఉండడం, పెద్ద కుటుంబాలు ఉండేవి. కానీ నేడు పరిస్థితులు పూర్తి భిన్నంగా మారిపోయాయి.

సెల్ ఫోన్స్, సోషల్ మీడియా ప్రభావం

శాస్త్ర, సాంకేతిక రంగాలు కొత్త పుంతలు తొక్కుతోన్న తరుణంలో ప్రపంచం రాకెట్ స్పీడుతో సామాజిక అంశాల్లో తీవ్ర మార్పులు చోటుచేసుకుంటున్నాయి. పుట్టిన చిన్నారుల నుంచి వృద్ధుల వరకు చేతిలో సెల్‌ఫోన్ లేకుండా రోజు గడవని పరిస్థితులు నెలకొన్నాయి. పనుల్లో బిజీబిజీగా ఉండే తల్లిదండ్రులు తమ చిన్నారుల చేతుల్లో సెల్‌ఫోన్లు పెడుతున్నారు. చిన్ననాటినుంచే సెల్‌ఫోన్ అందుబాటులోకి వస్తోంది. ఒకవైపు ఆరోగ్యం, మరోవైపు మానసిక వత్తిడి పిల్లలపై తీవ్ర ప్రభావం పడుతుంది.



ఏలూరు సర్వజన ఆసుపత్రి

మనస్థాపంతో ఆత్మహత్య

ఏలూరు పత్తేబాద మంచినీళ్లతోటలో 13 ఏళ్ల బాలుడు తీవ్ర మానసిక వత్తిడితో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తల్లిదండ్రులు కుటుంబ జీవనానికి ఒక వస్త్ర దుకాణంలో చిరుద్యోగులుగా పనిచేస్తున్నారు. కొద్ది రోజులుగా బాలుడు చదువుపై ధ్యాస లేకుండా పాఠశాలకు సైతం డుమ్మా కొడుతూ ఇంట్లోనే ఉంటున్నాడు. స్కూల్‌కు వెళ్లటంలేదంటూ తల్లిదండ్రులు బాలుడిని మందలించారు. తీవ్ర మనస్థాపంతో బాలుడు ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

మానసిక ఒత్తిడితో ఉరేసుకుని..

ఏలూరు వన్‌టౌన్ భావిశెట్టివారి పేటలో ప్రైవేటు పాఠశాలలో 8వ తరగతి చదివే బాలిక తీవ్ర మానసిక వత్తిడితో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. బాలిక మానసిక వ్యాధితో బాధపడుతూ వైద్య చికిత్స పొందుతోంది. తల్లిదండ్రులు ఇంట్లో లేని సమయంలో, బాలిక ఒంటరిగా ఉన్న సమయంలో ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది.

పిల్లలకు అండగా ఉండాలి



పిల్లలకు 18 నుంచి 21 ఏళ్ల వయసు వచ్చే వరకు బ్రెయిన్‌లో భావోద్వేగాలను నియంత్రించే వ్యవస్థ పూర్తిస్థాయిలో ఏర్పడదు. ఈ వయస్సులో పిల్లలు సామాజిక పరిస్థితులను, ఇంట్లో తల్లిదండ్రులు, బంధువుల జీవన శైలిని గమనిస్తూ నేర్చుకుంటూ ఉంటారు. పిల్లల మానసిక స్థితిని అర్థం చేసుకుంటూ, వారి భావోద్వేగాలను నియంత్రిస్తూ క్రమశిక్షణ, మంచి లక్షణాలను అలవర్చాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉంది. పిల్లలకు లక్ష్యాలను నిర్దేశిస్తూ వాటిని అధిగమించేందుకు సహకరించాలి. సెల్‌ఫోన్స్ పిల్లలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఏలూరు సర్వజన ఆసుపత్రిలో ప్రత్యేకంగా మానసిక వైద్య విభాగం ఉంది. కౌన్సిలింగ్ ఇస్తూ.. చికిత్స అందించేలా తోడ్పాటు అందిస్తాం. హాస్పిటల్‌కు వెళ్లటానికి సిగ్గుపడితే పిల్లలు, పెద్దలు ఎవరైనా వారి భవిష్యత్‌ను నాశనం చేస్తుందనే విషయాన్ని గుర్తించాలి.

– డాక్టర్ సీహెచ్ వంశీకృష్ణ, మానసిక వైద్య విభాగం హెచ్‌వోడీ, జీజీహెచ్, ఏలూరు

మానసిక ఒత్తిడి



నేడు విద్యార్థి దశ నుంచే తీవ్రమైన పోటీతో పిల్లలు తోటి వారితో పోల్చుకుంటూ ఆత్మ న్యూనతాభావంతో తమను తాము తక్కువగా భావిస్తూ మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. సెల్‌ఫోన్లు పిల్లలకు అందుబాటులో ఉండడంతో సోషల్‌మీడియాలో అధిక సమయాన్ని గడుపుతూ ఉండటం పెను ప్రమాదంగా మారింది. తల్లిదండ్రులతో పాటు పాఠశాలల్లో ఉపాధ్యాయులు పిల్లల ప్రవర్తనను గమనించాలి. నిత్యం వారితో మాట్లాడాలి. స్కూల్‌లో వారి ప్రవర్తనను స్నేహితులు, టీచర్స్‌ను అడిగి తెలుసుకోవాలి. పిల్లల్లోని సహజమైన ప్రతిభ, ఆశలు తెలుసుకుంటూ వారిలో సృజనాత్మకతను ప్రోత్సహించేలా ఉండాలి. నేడు తల్లీదండ్రి ఇంట్లో ఎక్కువ సమయాన్ని గడపలేని పరిస్థితి ఏర్పడడంతో పిల్లల ఆలోచన సరళి గుర్తించలేకపోతున్నారు. పిల్లల మానసిక స్థితిలో మార్పు వస్తే కౌన్సిలింగ్ ఇవ్వాలి.

– అక్కింశెట్టి రాంబాబు, సైకాలజిస్ట్, తణుకు

అభ్యసనా సామర్థ్యాలను పెంచేలా బోధించాలి



మాట్లాడుతున్న సమగ్రశిక్ష ఏపీసీ పంకజ్ కుమార్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని పెంపొందించేలా ఉపాధ్యాయులు బోధన సాగించాలని సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ కె.పంకజ్ కుమార్ సూచించారు. స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల హైస్కూల్ ప్లస్‌లో శనివారం పాల్ ల్యాబ్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పంకజ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పర్సనలైజ్డ్ అడాప్టివ్ లెర్నింగ్ (పీఏఎల్)పై 352 కేజీబీవీ పాఠశాలల్లో ఉపాధ్యాయులకు ల్యాబ్ ట్రైనింగ్ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో కాకినాడ, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాలోని మొత్తం 10 కేజీబీవీల ప్రిన్సిపాళ్లు, గణితం, ఆంగ్ల, తెలుగు ఉపాధ్యాయులు శిక్షణ పొందుతున్నారన్నారు. జిల్లాలో గతంలో 18 ల్యాబ్‌లు ఉండగా, ప్రస్తుతం అదనంగా మరో 14 ల్యాబ్‌లను ప్రభుత్వం మంజూరు చేసిందని చెప్పారు. ఆరు నుంచి తొమ్మిదో తరగతి వరకు చదివే విద్యార్థులు లెక్కలు, ఇంగ్లీష్, తెలుగు పాఠ్యాంశాలను సులభంగా పజిల్స్ రూపంలో నేర్చుకొనేలా ఈ పాల్ ల్యాబ్లోని ట్యాబ్లు ఉపయోగపడతాయని వివరించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష పాల్ కో ఆర్డినేటర్ డి.మాధవీలత, ఏలూరు ఉపవిద్యాశాఖాధికారి ఎ.రవి ప్రకాష్, జిల్లా ఏఎంఓ ఆర్ రామారావు, జీసీడీఓ బి.నవీన కుమారి, ఏఎల్ఎస్ కో ఆర్డినేటర్, డీఎస్ఓ తదితరులు పాల్గొన్నారు.

జీతాలు చెల్లించకపోవడం శోచనీయం



క్యాజువల్ లీవ్ బుక్ విడుదల చేసిన అతిథులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్రంలో ఉపాధ్యాయులకు ఈ నెల 1న జమ కావాల్సిన డిసెంబర్ నెల జీతాలు 4వ తారీఖు ముగిసినా చెల్లించకపోవడం శోచనీయమని ఏపీటీఎఫ్ ఏలూరు నగర శాఖ అధ్యక్షుడు కురుమ ఆనంద్ కుమార్ వాపోయారు. ఏపీటీఎఫ్ ఏలూరు నగర శాఖ సమావేశం స్థానిక సుబ్బమ్మ దేవి నగరపాలక ఉన్నత పాఠశాలలో ఆనందకుమార్ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ప్రధాన కార్యదర్శి అబ్బదాసరి శ్రీనివాసరావు మాట్లాడుతూ 2023 జూలై నుంచి పీఆర్‌సీ అమలు చేయాల్సి ఉండగా, ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు గడిచినా మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా కనీసం మధ్యంతర భృతి కూడా ప్రకటించకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉద్యోగ, ఉపాధ్యాయులకు వెంటనే మధ్యంతర భృతి ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యక్షుడు ఎల్‌వీఏ రత్నకుమార్ మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయుల తెలుగు, హిందీ పదోన్నతుల్లో గతంలో అప్‌గ్రేడేషన్ ద్వారా పదోన్నతి పొందిన ఉపాధ్యాయులు ఎవరికీ నష్టం జరగకుండా చూడాలని కోరారు. ఏలూరు నగర శాఖ ఆధ్వర్యంలో ఏలూరు జిల్లా కౌన్సిలర్ వీవీ సుబ్రహ్మణ్యం ఆర్థిక సహకారంతో ముద్రించిన ఉపాధ్యాయుల క్యాజువల్ లీవ్ బుక్కులను ప్రధానోపాధ్యాయులు పి.కుటుంబరావు విడుదల చేశారు. సమావేశంలో నగర శాఖ ఉపాధ్యక్షులు ఎంవీ సుబ్బారావు, ఎండబ్ల్యూ బెనర్జీ, నగర శాఖ కార్యదర్శులు కె.పాట్టియ్య, ఎం వెంకటేశ్వరరావు, టి.ప్రకాష్, ఎ.సాంబమూర్తి, ఏలూరు జిల్లా కౌన్సిలర్లు డి.కేదారేశ్వర స్వామి, సీహెచ్ వెంకటరత్నం, కె.సూర్య ప్రకాష్, కె.కుమార్, జి.రాజారావు, జె.శాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కళాశాలలో మధ్యాహ్న భోజనం ప్రారంభం



జూనియర్ కళాశాలలో భోజనం చేస్తున్న కలెక్టర్ తదితరులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) లతో కలిసి జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ప్రారంభించారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డించి, వారితో కలిసి సహపంక్తి భోజనం చేశారు. వారితో ముఖాముఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యకు ప్రాధాన్యత ఇస్తున్నట్టు చెప్పారు. కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలోని 19 కళాశాలల్లో 3860 మంది విద్యార్థినీ, విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో పాటు, సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర పథకం ద్వారా పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు అందిస్తున్నామన్నారు. విద్యలో వెనుకబడిన వారికి స్టడీ మెటీరియల్ అందించి, విద్యా బోధన చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యా వ్యవస్థలో ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చిందన్నారు. విద్యార్థినీ విద్యార్థులు తమకు టాయిలెట్స్ సౌకర్యం, క్రీడా సౌకర్యం, పరికరాలు అందించాలని కోరగా వెంటనే వాటిని ఏర్పాటు చేయాలని ప్రిన్సిపాల్ గిరిబాబును కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ సీఈసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న దివ్యాంగుడైన విద్యార్థి సాయి వినోద్‌ని కలిసి అతని సమస్యను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజన క్యూ లైన్‌లో నిలుచుని భోజనం చేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ అచ్యుత్ అంబరీష్, జిల్లా విద్యా శాఖాధికారి ఎం.వెంకట లక్ష్మమ్మ, ఆర్టీసీ విజయవాడ రీజినల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, తహసీల్దార్ శేషగిరిరావు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జీ.గిరిబాబు పాల్గొన్నారు.

కాకినాడకు యూటీఎఫ్ పతాక జాతా



కాకినాడకు బయలుదేరిన యూటీఎఫ్ పతాక జాతా

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఈ నెల 5వ తేదీ నుంచి 8వ తేదీ వరకు కాకినాడలో నిర్వహించే యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలకు ఏలూరు నుంచి యూటీఎఫ్ ఏలూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో శనివారం పతాక జాతా నిర్వహించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు షేక్ ముస్తఫా ఆలీ, ప్రధాన కార్యదర్శి రవికుమార్ రుద్రాక్షి మాట్లాడుతూ యూటీఎఫ్ రాష్ట్ర 17వ విద్యా వైజ్ఞానిక మహాసభలు, స్వర్ణోత్సవ మహాసభలకు జిల్లాల నుంచి పతాక జాతాలు వెళుతున్నట్టు చెప్పారు. ఈ జాతాలు రాష్ట్రం నలుమూలల నుంచి కాకినాడకు శనివారం సాయంత్రం చేరుకుంటాయని తెలిపారు. ఇందులో భాగంగా 14వ రాష్ట్ర మహాసభలు జరిగిన ఏలూరు నుంచి ఏలూరు పతాకజాత శనివారం మధ్యాహ్నం 12 గంటలకు ఏలూరు యూటీఎఫ్ జిల్లా కేంద్ర కార్యాలయం వద్ద ప్రారంభించామని చెప్పారు. ఏలూరు చేరుకున్న నెల్లూరు, తిరుపతి, ఒంగోలు, ఎన్టీఆర్ జిల్లాల పతాక జాతాలతో పాటు ఏలూరు జాత కూడా రాజమండ్రి జాతాను కలుపుకొని శనివారం సాయంత్రం కాకినాడ చేరుకుంటాయని వివరించారు. ఈ పతాక జాతాను ఏలూరు జిల్లా నుంచి రాష్ట్ర కార్యదర్శి బి.సుభాషిణి ప్రారంభించారు. ఈ జాతలో నాయకులు జి.వెంకటేశ్వరరావు, ఎస్ సుధారాణి, జీవీ రంగమోహన్, కె.కమల్ కుమార్, బి.మోహన్ రావు, తేరా ప్రసాద్, సీహెచ్ స్వర్ణరేఖ, ఎ.దుర్గా భవాని, ఎస్ మణి, పి.నాగమణి, ఎండీ జక్రియ తదితరులు పాల్గొన్నారు.

7న జాబ్ మేళా

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో ఏలూరులోని ప్రభుత్వ డీఎల్‌టీసీ/ఐటీఐ కళాశాల (స్కిల్ హబ్)లో ఈ నెల 7న జాబ్ మేళ నిర్వహిస్తున్నట్లు స్థానిక డీఎల్‌టీసీ సహాయ సంచాలకులు ఎస్ ఉగాది రవి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాలో ఫ్లిప్ కార్ట్, రిలయన్స్, మీషో, సార్య బిజినెస్ సొల్యూషన్స్ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని, సుమారు 150 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు సెల్ నెంబర్లు 94934 82414, 89196 08183ను (9988 853335 – టోల్ ఫ్రీ)లో సంప్రదించవచ్చన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	28
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	31
ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	13
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	36

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.45	4820	15
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.15	4822	21
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	30
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	27
ఏలూరు-జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	24
ఏలూరు-బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	26
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	25
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	22
ఏలూరు - తిరుపతి	16.00	4830	34

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	16	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	36	చిక్కుడు కాయలు	56
వంకాయలు (కాంతులు)	48	బీన్సచిక్కుడు	80
వంకాయలు (తెలుపు)	44	చామదుంపలు	40
బెండకాయలు	36	ములక్కాడలు	10, 15
పచ్చిమిర్చి	32-36	కంద	60
కాకర కాయలు	36-44	బీట్‌రూట్	46
బీరకాయలు	30	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	50	ఫ్రెంచ్‌బీన్స్	80
క్యాబేజీ	28	అల్లం	70
క్యారెట్	48	కొత్తిమీర (కట్ట)	15
దొండకాయలు	52	పాలకూర	10
బంగాళదుంపలు	30-36	చుక్కకూర	10
ఉల్లిపాయలు	42	తోటకూర	10
గోరుచిక్కుడు	40	గోంగూర	07
దోసకాయలు	34-40	పుదీనా	05
ఆనబకాయ (1)	20-30	క్యాప్సికమ్	72
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	36

దుకాణంలోకి దూసుకెళ్లిన లారీ

జంగారెడ్డిగూడెం: స్థానిక దేవరపల్లి - తల్లాడ జాతీయ రహదారిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంతో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. నాగాలాండ్‌కు చెందిన ట్రాలీ లారీ హైదరాబాద్ నుంచి విశాఖపట్నం వైపు ఇనుప గొట్టాలు లోడుతో వెళుతుంది. స్థానిక ఎన్టీఆర్ నగర్ వద్దకు వచ్చేసరికి తాడువాయి షుగర్ ఫ్యాక్టరీకి వెళుతున్న చెరకు లోడు ట్రాక్టరు ఎదురుగా రావడంతో, డ్రైవర్ ట్రాలీ లారీని ఓ పక్కకు తిప్పే క్రమంలో చెరుకు ట్రాక్టరును ఢీకొట్టి రోడ్డు అంచున గల కోడిదాసు నర్సింహరావుకు చెందిన కిళ్లీ కొట్టు లోనుంచి దూసుకెళ్లి పక్కనే ఉన్న కనకదుర్గవారి ఆలయాన్ని ఢీకొట్టి నిలిచిపోయింది. ఈ ఘటనలో గాయాలపాలైన డ్రైవర్‌ను జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రమాద సమయంలో దుకాణాలు, ఆలయం వద్ద ప్రజలు లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది.

అంగన్‌వాడీల నిరసన

బుట్టాయగూడెం: అంగన్‌వాడీ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శనివారం ప్రగతిశీల అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం దొరమామిడిలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ మాట్లాడుతూ గతంలో అంగన్‌వాడీలు తమ సమస్యల కోసం సమ్మె చేస్తే పరిష్కారానికి గత ప్రభుత్వం రాత పూర్వకంగా హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. సమ్మె సమయంలో టీడీపీ జనసేన, అంగన్‌వాడీలకు మద్దతు ఇచ్చారని, తాము అధికారంలోకి రాగానే వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఆ హామీలు నేటికీ అమలుకు నోచుకోలేదని ఆరోపించారు. వాటిని పరిష్కరించే దిశగా కృషి చేయాలని కూటమి నేతలను కోరారు. అంగన్‌వాడీ కార్యకర్తలు బి.ఆకాష్, గురుగుంట్ల పద్మ పాల్గొన్నారు.

సందడిగా సంక్రాంతి సంబరాలు



భోగి మంట వద్ద విద్యార్థినుల కోలాట ప్రదర్శన

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలోని సీఆర్ఆర్ కళాశాల ప్రాంగణంలో సంక్రాంతి సంబరాలు–2025 ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ ఐక్యూఏసీ విభాగం ఆధ్వర్యంలో శనివారం సందడిగా నిర్వహించారు. భోగిమంటలు, రంగోళి, బొమ్మల కొలువు, కోలాటం, గంగిరెద్దుల విన్యాసం, హరిదాసు కీర్తనలు, సాంప్రదాయ వస్త్రధారణ, కేశాలంకరణ, గాలి పటాలు ఎగురవేయుట, గొబ్బెమ్మ పాటలు, చిన్నారులకు భోగి పండ్లు, పొంగలి, వివిధ రకాల పిండి వంటలను ప్రదర్శించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన విద్యా సంస్థల వైస్ ప్రెసిడెంట్ వీవీ బాలకృష్ణారావు భోగి మంటలతో సంబరాలను ప్రారంభించారు. తెలుగువారి సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. ట్రెజరర్ చిట్టూరి జానికి రామయ్య మాట్లాడుతూ నేటితరం యువతకు కూడా సంక్రాంతి విశిష్టత తెలిపేందుకే ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కేఎస్ విష్ణుమోహన్, ప్రిన్సిపాల్ కేఏ రామరాజు, మేనేజింగ్ కమిటీ సభ్యులు బొప్పన ప్రసాద్, కె.హరిరామ కృష్ణంరాజు, కల్కి సత్యనారాయణ, గుత్తా కాశీ విశ్వనాథరావు, పాలడుగు శ్రీరంగం, మామిళ్లపల్లి జయప్రకాష్ పాల్గొన్నారు.

పశువుల రవాణాను అడ్డుకున్న పోలీసులు

- రెండు వాహనాల సీజ్, ఐదుగురిపై కేసు
- 12 ఆవు దూడలు, 8 ఎద్దులు గో సంరక్షణశాలకు తరలింపు

ద్వారకాతిరుమల: మండలంలోని ఎం నాగులపల్లి జాతీయ రహదారిపై గోవుల అక్రమ రవాణాను శనివారం ఉదయం పోలీసులు అడ్డుకున్నారు. రెండు వహనాలను సీజ్ చేశారు. ఐదుగురు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. నల్లజర్ల వైపు నుంచి ఏలూరు వైపుకు పశువుల అక్రమ రవాణాపై సమాచారం అందుకున్న భీమడోలు ఎస్సై (ద్వారకాతిరుమల ఇన్‌చార్జి ఎస్సై) వై.సుధాకర్ సిబ్బందితో కలిసి వాహన తనిఖీ చేశారు. ట్రక్కులకు పూర్తిగా టార్పాలిన్‌లు కట్టి ఉన్న రెండు బొలేరో వాహనాలను తనిఖీ చేయగా, ఒక వాహనంలో 12 ఆవు దూడలు, మరో వాహనంలో 8 ఎద్దులు ఉన్నట్టు గుర్తించారు. తుని మార్కెట్ నుంచి విశాఖ జిల్లా ఎ.కొండూరు గ్రామానికి చెందిన గొట్టివాడ జాన్ అనే వ్యక్తి ఈ పశువులను హనుమాన్ జంక్షన్ మార్కెట్‌కు తరలిస్తున్నట్టు నిర్ధారించారు. దీంతో విశాఖ జిల్లా ఖందేపల్లి గ్రామానికి చెందిన బొలేరో వాహన డ్రైవర్ జెట్టి నాగేశ్వరరావు, హెల్పర్, వాహన యజమాని అయిన విశాఖపట్నం జిల్లా ఎ.కొండూరుకు చెందిన గొట్టివాడ సంజయ్ కుమార్‌లపై, మరో బొలేరో వాహనం డ్రైవర్ విశాఖ జిల్లా వేమగోట్టపాలెంకు చెందిన కొరడా అప్పలరాజు, వేమగోట్టపాలెంకు చెందిన హెల్పర్ కొరడా సురేష్, జాన్‌లపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. పశువులను తిమ్మనవీడు గో సంరక్షణా కేంద్రానికి తరలించారు.